క్లుప్తంగా

ఛలో ఢిల్లీని విజయవంతం చేయండి


పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

పాణ్యం: ఈ నెల 11వ తేదీన చేపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌బీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రాజునాయుడు మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, నిరుద్యోగంపై ఢిల్లీలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. దేశంలో అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు భరోసా లేదన్నారు. అంతేగాక నిత్యావసర సరుకుల ధరలు అందుబాటులో లేక సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. అలాగే ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు పెరిగిపోతున్నట్లు వివరించారు. దీనిపై తగు చర్యలు చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎఫ్‌బీ నాయకులు వెంకటాద్రి, రవింద్రనాథ్, శంకర్, మద్దిలేటి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనుల పరిశీలన


రీసర్వే పనులను పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు: కల్లూరు మండలం పర్ల గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను రాష్ట్ర పరిశీలకులు, నోడల్ అధికారి బీఎల్ కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వేణు రంగప్రసాద్ క్షేత్ర పరిశీలన చేశారు. అనంతరం గ్రామంలోని రైతులతో భూ సమస్యల గురించి చర్చించారు. సమస్యలను పరిష్కరించడంలో ఉమ్మడి భాగస్తులందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. రీసర్వే విజయవంతం కావడంతో రైతుల పాత్ర, సహకారం ఎంతో అవసరమని అధికారులు రైతులకు వివరించారు. మండల సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

దర్గా ముస్తాబు


విద్యుత్ బల్బుల అలంకరణలో దర్గా

సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవులలో బడేసావ్ స్వామి దర్గాను నిర్వాహకులు ముస్తాబు చేశారు. తుంభద్ర నదీతీరంలో వెలసిన బడేసావ్ స్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా దర్గాను విద్యుత్ బల్బులతో అలంకరించగా, స్వామి వారి మూల విరాట్‌ను ప్రత్యేక అలంకరణతో నిర్వాహకులు సిద్ధం చేశారు.

ఉద్యోగినులతో అసభ్యంగా ప్రవర్తిస్తే ఊరుకోం


మాట్లాడుతున్న ఏపీ జేఏసీ మహిళా విభాగం చైర్‌పర్సన్ సహారాబాను

కర్నూలు(సెంట్రల్): పనిచేసే ప్రదేశంలో మహిళా ఉద్యోగినులపై అసభ్యంగా ప్రవర్తించినా, లైంగికంగా వేధించినా చేస్తూ ఊరుకోమని ఏపీ జేఏసీ మహిళా విభాగం చైర్‌పర్సన్ సహారాబాను, అసోసియేట్ చైర్‌పర్సన్ మల్లీశ్వరి, జనరల్ సెక్రటరీ పద్మావతి హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళ ఉద్యోగినులపై లైంగిక వేధింపులు ఉన్నాయని, అలాంటి వారు చెప్పుకోవడానికి బయటకు రావడం లేదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇలాంటి సంఘటనలకు చోటు లేదని, ఎవరైనా బరితెగించి ఇబ్బంది పెడితే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగినులపై వేధింపులు ఎక్కువగా ఉన్నాయన్నారు. తోటి ఉద్యోగినులపై సంస్కారరహితంగా మసులుకోకుంటే ఇబ్బందులు తప్పవని వారు హెచ్చరించారు.


కరిమద్దెలలో భారీ వర్షానికి నేలవాలిన వరి


బూజునూరులో దెబ్బతిన్న కొర్ర పంట


గడివేముల ఎస్సీ కాలనీలో ఇంట్లోకి వచ్చిన వర్షపునీరు

నిండా ముంచిన వర్షం

- మండలంలో 100.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- భారీగా దెబ్బతిన్న మొక్కజొన్న పంట


గడివేములలో మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపు నీరు

గడివేముల: మండల పరిధిలో వివిధ గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురిసిన అకాల వర్షానికి వివిధ పంటలకు భారీగా నష్టం జరిగింది. ముఖ్యంగా రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు దిగుబడులను కల్లాల్లో ఆరబెట్టుకున్నారు. అప్పటికప్పుడు వాతారణంలో మార్పులు ఏర్పడి ఒక్కసారిగా వర్షం కుమ్మరించడంతో మిరప, మొక్కజొన్న దిగుబడులు పూర్తిగా తడిసిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన పంట అకాల వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 100.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ సిబ్బంది చెప్పారు. గడివేముల ఎస్సీ కాలనీలో వర్షపునీరు ఇంట్లోకి చేరడంతో బియ్యం, కందిబేడలు తడిసిపోయాయి. కుందూ, మద్దిలేరులో వర్షపునీరు పారింది. మంచాలకట్ట గ్రామంలో ఆరబెట్టిన మిరప తడిసిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కోడుమూరు రూరల్: మండలంలో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు 46.4 మి.మీ వర్షపాతం కురిసింది. అకాల వర్షం వల్ల కోడుమూరులో గాజులదిన్నె ప్రాజెక్టు కింద వందకు పైగా ఎకరాల్లో సాగు చేసిన కొర్ర పంట నేలవాలింది. మరో 20 రోజుల్లో చేతికొస్తుందనుకుంటున్న తరుణంలో అకాల వర్షం తీవ్ర నష్టం మిగిల్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


సి.బెళగల్ సమీపంలో వర్షపు నీటిలో తడిసిన వరి మెద

సి.బెళగల్: మండలంలో గురువారం సాయంత్రం 37.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అకాల వర్షం వల్ల మండలంలో కల్లాల్లో ఉన్న మిరప, పొగాకు దిగుబడులు తడిసి పోయాయి. సి.బెళగల్ సమీపంలోని కోసి కుప్ప నేర్పేందుకు సిద్ధంగా ఉన్న వరి మెద తడిసిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

రీసర్వే పరిశీలన


రీసర్వేను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు(రూరల్): మండల పరధిలోని ఇ.తాండ్రపాడు పరిధిలో జరుగుతున్న భూముల రీసర్వేను శుక్రవారం అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు, అడిషనల్ కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఇ.తాండ్రపాడు గ్రామం.. తెలంగాణ రాష్ట్రంతో భూ సరిహద్దు కలిగి ఉన్న గ్రామం అయినందున సరిహద్దు రాళ్లను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లడతూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి అధికారు సూచించారు. రీ సర్వే నిర్వహించేటప్పుడు సంబంధిత రైతులతో అధికారులు స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎల్ఓ మునికన్నన్, రూరల్ తహసీల్దార్ టి.వి.రమేష్‌బాబు, సర్వేయర్ సుధాకర్ పాల్గొన్నారు.

అర్బన్ ఏఎస్ఓగా నవీన్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు అర్బన్ అసిస్టెంట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్‌గా నవీన్‌కుమార్‌ను నియమించారు. ఈయన ప్రస్తుతం గూడూరు సీఎస్‌డీగా పనిచేస్తున్నారు. అయితే కర్నూలు అర్బన్ ఏఎస్ఓగా ఉన్న రామాంజనేయరెడ్డిని అనారోగ్యం రీత్యా డీఎస్ఓ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో నవీన్‌కుమార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు జేసీ డాక్టర్ బి.నవ్య ఉత్తర్వులు విడుదల చేశారు. కాగా, కర్నూలు నగరంలో రేషన్ బియ్యం విడిగా పక్కదారి పడుతోందని, ఓ మంత్రి అనుచరులు మాఫియాగా ఏర్పడి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నా ఏఎస్ఓగా ఉన్న రామాంజనేయరెడ్డి సరైన చర్యలు తీసుకోలేదేన్న కారణంతోనే ఆయన్ను తప్పించి ఆ స్థానంలో నవీన్‌కుమార్‌ను నియమించినట్లు తెలుస్తోంది.

తాగునీటి సమస్య రానీయొద్దు

పాణ్యం: వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి రానీయొద్దని ఎంపీపీ ఉసేన్‌బీ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి ప్రారంభమైన తరుణంలో ప్రతి గ్రామంలో ప్రజలకు సరిపడా తాగునీరు అందించాలన్నారు. అందకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తగు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నీటి వనరులపై దృష్టి సారించి ఎక్కడ ఇబ్బందులు రానీయొద్దన్నారు. అలాగే ఆరోగ్యశాఖ అధికారులు ప్రజలు వడదెబ్బ భారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఉపాధి సిబ్బంది లక్ష్యాలను చేరుకోవాలన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ ఉసేన్‌బీ

అనంతరం ప్రభుత్వ శాఖల అధికారులు తమ పురోగతిని చదివి వినిపించారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, డీటీ శివశంకర్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అద్దె భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రాలు


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ త్రివేణి

ఓర్వకల్లు: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనంలోకి తరలిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రివేణి తెలిపారు. అంగన్ వాడీ కేంద్రాలపై శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'చిన్నపాటి వర్షానికే ఇలా' అనే శీర్షికన వెలువడిన వార్తకు సంబంధిత శాఖ నుంచి స్పందన లభించింది. ఈ మేరకు సూపర్‌వైజర్ త్రివేణి ఉప్పలపాడు గ్రామానికి చేరుకొని ఏళ్ల తరబడి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. గురువారం కురిసిన వర్షానికి తలెత్తిన సమస్యలను గూర్చి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షానికి భవనం గోడల నుంచి నీరు కారి, పిల్లలు కూర్చోవడానికి ఇబ్బందిగా మారినట్లు గుర్తించారు. అలాగే కేంద్రంలోని వంట సరుకులు, ఆహార పదార్థాలు పూర్తిగా పాడైపోయినట్లు తెలిపారు. కేంద్రంలో వర్షపునీటి నిల్వ ఏర్పడడానికి అక్కడ నిర్మించిన సీసీ రోడ్డు కల్వర్టు కారణమని పేర్కొన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి అంగన్‌వాడీ కేంద్రం కోసం గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నట్లు వెల్లడించారు.

నైపుణ్యంతోనే మహిళలకు జీవనోపాధి

ఓర్వకల్లు: చేతి వృత్తులలో నైపుణ్యం కల్గివుంటే మహిళలు మెరుగైన జీవనోపాధి పొందవచ్చని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం మండలంలోని కాల్వ గ్రామంలో మండల మహిళా సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విజయభారతి ఆధ్వర్యంలో మగ్గంవర్క్‌పై మూడు నెలల శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గౌరు చరిత ప్రారంభించారు. అంతకుముందు ఓర్వకల్లు బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక పేటలో రూ.40 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఐటీసీ పొగాకు గోడౌన్ వద్దకు వెళ్లి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా గిట్టుబాటు ధరకు పొగాకు దిగుబడులు కొనుగోలు చేయాలని కంపెనీ సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.


ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

రహదారి బురదమయం!

కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తి ప్రధాన వీధిలో ఇటీవల సీసీ రోడ్డును నిర్మించారు. సీసీ రోడ్డు క్యూరింగ్ కోసం వేసిన నల్లరేగడి మట్టిని తొలగించకుండా అలాగే వదిలేయడంతో రోడ్డంతా బురదమయంగా తయారైంది. బురదమయంగా మారిన రోడ్డుపై కాలు పెడితే జనాలు జారిపడే పరిస్థితి నెలకొంది. ఇకనైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుపై వదిలేసిన మట్టి కుప్పలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పులకుర్తిలో బురదమయంగా ఉన్న ప్రధాన రహదారి



కుంటను తలపిస్తున్న మురుగు

గడివేముల: మండల కేంద్రంలో సినిమా హాలు సమీపంలో రోడ్డుపై మురుగునీరు కుంటను తలపిస్తుంది. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే నిలిచి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి నిత్యం మురుగునీటిలో నడవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గడివేములలో రోడ్డుపైనే నిల్వ ఉన్న మురుగునీరు

పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేయాలి

- అధికార పార్టీకి కొమ్ముకాయడం తగదు
- గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదు
- కొందరి అత్యుత్సాహంతో గ్రామాల్లో ఘర్షణలు

పాణ్యం: రాష్ట్రంలో పోలీసు శాఖ నిష్పక్షపాతంగా పని చేయడం లేదని, అధికారి పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఎస్.కొట్టాల గ్రామంలో జరుగుతున్న హజరత్ దస్తగిరిస్వామి ఉరుసు మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా గాడి తప్పిందని, అధికారులందరూ ప్రభుత్వానికి దాసోహమయ్యారని విమర్శించారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, కూటమి ప్రభుత్వం విష సంస్కృతిని అలవాటు చేస్తుందన్నారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు, మహిళలపై వేధింపులు, దాడులు నిత్యం జరుగుతూనే ఉన్నాయని వివరించారు. కూటమి నాయకుల ప్రోద్బలంతో గ్రామాల్లో బెల్టుషాపులు ఎక్కువయ్యాయని, మద్యం ఏరులై పారుతోందన్నారు.


దస్తగిరి స్వామి వారికి ఫాతెహాలు సమర్పిస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

కొత్త సమస్యలు తెస్తున్న కొందరు అధికారులు

కూటమి నాయకుల మెప్పు కోసం కొందరు పోలీసు అధికారులు ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఘర్షణలకు పురిగొల్పుతున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని మండిపడ్డారు. తద్వారా గ్రామాల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అధికారులు తమ తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయిస్తుమన్నారు.

ఫిర్యాదులు గగనమే

గ్రామాల నుంచి ప్రతిపక్ష నాయకులు వస్తే కనీసం ఫిర్యాదు తీసుకునేందుకు కూడా పోలీసు అధికారులు నిరాకరిస్తున్నారని కాటసాని మండిపడ్డారు. కనీసం సమస్య వినకుండా సమయం లేందటూ దాటవేస్తున్నారన్నారు. కూటమి పాలనలో సమస్యలు చేప్పుకునేందుకు కూడా అధికారులు సహకరించకపోవడం ఓ దౌర్భాగ్యమన్నారు. అధికారులు ఎలాంటి బేధాభిప్రాయం చూపకుండా ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

హోరాహోరీగా బండలాడుగుడు పోటీలు

పాణ్యం: మండల పరిధిలోని ఎస్.కొట్టాల గ్రామంలో హజరత్ దస్తగిరి స్వామి వారి ఉరుసు సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలను వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చెర్నకోలు అదిలించి ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంబరాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రా మాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం శుభపరిణామమన్నారు. పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 18 జతల ఎడ్లు పాల్గొన్నాయి. విజేతలకు వరుసగా రూ.40, రూ.30, రూ.20, రూ.15, రూ.12, రూ.10, రూ.8, రూ.6 వేల చొప్పున నగదు బహుమతులు అందించనున్నారు.


వృషభాల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

కార్యకర్తల అభీష్టం మేరకు పర్యటన

అంతకుముందు గ్రామానికి చేరుకున్న కాటసానికి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు.గ్రామస్తుల అభీష్టం మేరకు ఆయన గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పర్యటించారు. ప్రతిఒక్కరినీ పలకరిస్తూయోగక్షేమాలు తెలుకుంటూముందుకు సాగారు.

క్రీడల్లో ప్రతిభ చాటుకోవాలి

గ్రామంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలను కాటసాని తిలకించారు. క్రీడాకారులు తమ ప్రతిభ, నైపుణ్యాలను చాటాలని ప్రోత్సహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు రామలక్ష్మయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, గోరుకల్లు సర్పంచ్ మహబూబ్‌బాషా, జి.సుబ్బారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, డాల్‌సా, ఉసేన్‌సా, మాబుసాహేబ్, జయచంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చింతలపల్లె హుజీస్ ఖాన్ గుండె చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జీకే వెంగన్న, గ్రామ నాయకులు చిన్న వెంకటేశ్వర్లు, నూర్‌అహ్మద్, రసూల్‌బాష తదితరులు వెంట ఉన్నారు.

ట్రేడ్ లైసెన్సుపై ఫేక్ కాల్స్ నమ్మొద్దు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు సంబంధించి ట్రేడ్ లైసెన్సు రుసుము చెల్లించాలని కొందరు అజ్ఞాత వ్యక్తులు వాణిజ్య దుకాణదారులకు కాల్స్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటువంటి కాల్స్‌ను నమ్మవద్దని ఆయన సూచించారు. వాణిజ్య దుకాణదారులు తమకు పరిచయమైన శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ కార్యదర్శి, మేస్త్రీల ద్వారానే ట్రేడ్ లైసెన్సు రుసుము చెల్లించి రశీదు పొందాలని సూచించారు. 6304326727 ఈ నెంబర్ లేదా ఇతర నంబర్ల నుంచి కాల్ వస్తే తొందరపడి ఫోన్‌పే చేయవద్దన్నారు.

శిక్షణపై ఆసక్తి చూపని మహిళలు

సి.బెళగల్: మండలంలోని స్త్రీశక్తి భవన్‌లో జీవనోపాదులపై ఇస్తున్న శిక్షణకు మహిళలు ఆసక్తి చూపడం లేదు. రెండు రోజులుగా స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండల వెలుగు ఏపీఎం రామేశ్వర్, సిబ్బందితో కలిసి బ్యాంక్ రుణాలు – జీవనోపాదులు అంశంపై శిక్షణ ఇస్తున్నారు. అయితే మహిళలు శిక్షణపై ఆసక్తి చూపకపోవడంతో మూడోరోజు శుక్రవారం ఉదయం 11:46 గంటల సమయంలో నామమాత్రంగా హాజరు కావడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. మధ్యాహ్నం 12:16 గంటల అనంతరం మరికొంతమంది మహిళలు శిక్షణకు హాజరయ్యారు


తక్కువ సంఖ్యలో మహిళలు హాజరుకావడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ


ఇనగండ్లలో సీసీ రోడ్ల నాణ్యతను తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

సి.బెళగల్: మండలంలోని నాలుగు గ్రామాల్లో సీసీ నిర్మాణాల నాణ్యతలను క్వాలిటీ కంట్రోల్ (క్యూసీ) అధికారులు తనిఖీ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని కొండాపురం, ఇనగండ్ల, సి.బెళగల్, కంబదహాల్ గ్రామాల్లో క్వాలిటీ కంట్రోల్ డీఈ రవీంద్రారెడ్డి, ఏఈ విజయభాస్కర్, మండల పీఆర్ ఏఈ వెంకటప్రకాష్ కలిసి గ్రామాల్లో పర్యటించారు. సీసీ రోడ్ల నాణ్యతను వారు తనిఖీ చేసి, నమూనాలను సేకరించారు. వారివెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ పాపారాయుడు, సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లు శ్రీరాములు, ఇమ్మానియేల్, వెంకటేశ్వరమ్మ, మాధురి ఉన్నారు.